క్లుప్తంగా

పశువులకు గాలికుంటు టీకాలు



పాడి రైతులకు సూచనలిస్తున్న వెలుగోడు ఏవీహెచ్ఏడీ

బండి ఆత్మకూరు: మండలంలోని ఏ.కోడూరు, లింగాపురం గ్రామాల్లోని పశువులకు గురువారం పశు వైద్యాధికారులు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఏ. కోడూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాన్ని వెలుగోడు ఏవీహెచ్ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులందరూ తమ పశువులకు తప్పకుండా టీకాలు వేయించి, వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏ పాపిరెడ్డి, జెవీఓ లక్ష్మీ నారాయణ, జయశ్రీ, సమీరా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అక్షర జ్ఞానం అవసరం



వలంటీర్లకు పుస్తకాలు అందజేస్తున్న అధికారులు

పాములపాడు: మెరుగైన సమాజం రావాలంటే ప్రతి ఒక్కరికీ అక్షర జ్ఞానం ఉండాలని ఎంపీడీఓ చంద్రశేఖర్, వయోజన విద్య జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సర్వసభ్య సమావేశ భవనంలో అక్షరాంధ్ర కార్యక్రమంపై వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్షరాంధ్ర అక్షరాస్యత కేంద్రాలు సజావుగా నిర్వహించి ఉపాధి పనులు చేసే ప్రతి శ్రామికుడు వేలిముద్రలు లేకుండా చూడాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చదవడం, రాసే విధంగా నేర్పించాలని వివరించారు. అనంతరం వలంటీర్లకు పుస్తకాలను అందజేశారు. ఏపీఓ జయంతి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



ఎల్లన్న

నందికొట్కూరు: మిడుతూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజిక్స్ అధ్యాపకుడు మచ్చకంటి ఎల్లన్న, బెంగళూరు గీతం విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల గ్రామానికి చెందిన ఆయన్ను కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ నాయక్, అధ్యాపకులు అభినందించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రవచనం వినిపిస్తున్న కళాకారుడు

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. గురువారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై ఒంగోలుకు చెందిన పొన్నూరు వెంకట శ్రీనివాసులు వారిచే ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే వై.జయకృష్ణ భాగవతార్ హరికథ వినిపించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షుడు రణధీర్, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందించారు. సకాలంలో వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వేతనాలు చెల్లించాలని కోరారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి




మాట్లాడుతున్న తహసీల్దార్

ఆత్మకూరు: ఓటరు జాబితాలో తప్పుడు లేకుండా చూడాలని తహసీల్దార్ రత్నరాధిక, ఎలక్షన్ డీటీ రమణమ్మ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. 2022 ఎస్ఐఆర్ ఓటరు జాబితా ఆధారంగా 2025 ఓటర్ జాబితాను అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. వాటిలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. చనిపోయిన వారి ఓటర్ వివరాలను తొలగించాలని, ప్రజలకు ఓటు హక్కు గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు.

శ్రీగిరికి ఉత్సవ శోభ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రం దసరా నవరాత్రోత్సవాల ఉత్సవ శోభతో కళకళలాడుతుంది. శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఉభయ దేవాలయాలలోని ధ్వజస్తంభాలను, ఆలయాల ప్రధాన ద్వారాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. స్వామిఅమ్మవార్ల సందర్శనకు వచ్చిన పలువురు భక్తులు ఆలయంలో పూలతో అలంకరించిన సుందర దృశ్యాలను చూసి ముగ్దులవుతున్నారు.





శ్రీశైల ఆలయంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన దృశ్యాలు



తాటిపాడులో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



వెలుగోడు: కాత్యాయనీదేవిగా వాసవీమాత



పాములపాడు: అన్నపూర్ణాదేవిగా చౌడేశ్వరిమాత



బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో అన్నపూర్ణదేవి



అన్నపూర్ణగా సరస్వతీదేవి



ఆత్మకూరు: కూష్మాండ దుర్గాదేవిగా వాసవీమాత



పగిడ్యాల: నెహ్రూనగర్‌లో కాత్యాయినిగా..



బండి ఆత్మకూరు: కాకనూరు శారదా పీఠంలో..



మిడుతూరులో..

పరమేశ్వరి.. పాహిమాం

- కనుల పండువగా దసరా ఉత్సవాలు
- వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
- ఆలయాలు కిటకిట



మహానంది: హోమ పూజల్లో ఉభయదాతలు

మహానంది: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం ఆయా ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహానందిలో ఆలయ వేదపండితులు, రుత్వికులు, అర్చకులు శతచండీయాగశాలలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేపట్టారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవి శంకర అవధాని మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాల్లో శ్రీచక్ర నవావరణార్చన పూజలు ఎంతో ప్రధానమైనవన్నారు. కామేశ్వరీదేవి అమ్మవారికి ఎంతో ప్రీతికరమైనదని, మహా శక్తివంతమైందన్నారు. రుద్రహోమం, చండీహోమం, తదితర పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి.

- కొత్తపల్లి: కొలనుభారతిదేవి కాత్యాయనిదేవి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.
- నందికొట్కూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు కాత్యాయనిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం కళా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు కాత్యాయనిదేవిగా పూజలందుకున్నారు. మిడుతూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి కాత్యాయనిదేవిగా కటాక్షించారు. ఆలయ కమిటీ చైర్మన్ భూమా కృష్ణమోహన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- వెలుగోడు: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గురువారం కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవిని ఆరాధిస్తే ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలుగుతాయని పురోహితులు తెలిపారు. వేల్పనూరులోని అంకాల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు కూష్మాండ దేవి రూపంలో పూజలందుకున్నారు.
- పాములపాడు: స్థానిక చౌడేశ్వరి మాత ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి రూపంలో దర్శనమిచ్చారు. పంచామృతాభిషేకం, కలశారాధన, కుంకుమార్చన వంటి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
- బండి ఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల రాక దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆశ్రమ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఓంకార క్షేత్రానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.
- ఆత్మకూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు కూష్మాండ దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చారు. చౌడేశ్వరి ఆలయంలో మహాలక్ష్మి, స్థానిక శివాలయాల్లో పార్వతిదేవి అలంకరణలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు.
- జూపాడుబంగ్లా: స్థానిక ఆలయంలో అమ్మవారు కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రూపంలో సేవించిన వారికి విజయాలు చేకూరుతాయని పురోహితులు వివరించారు. జూపాడుబంగ్లా క్వార్టర్స్‌లోని సరస్వతీ అమ్మవారు అన్నపూర్ణమాతగా పూజలందుకున్నారు. భక్తులు పుష్పార్చన, కుంకుమార్చన, పంచామృతాభిషేకం వంటి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.
- పగిడ్యాల: నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పగిడ్యాల, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘణపురం తదితర గ్రామాల్లో కొలువుదీరిన దుర్గామాతను కాత్యాయినిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. లలితాసహస్రనామ పారాయణం చేశారు.
- బండి ఆత్మకూరు: కాకునూరులోని శారద జ్ఞానపీఠంలో శారదాంబ అమ్మవారు అన్నపూర్ణేశ్వరి దేవి రూపంలో దర్శనమిచ్చారు. అన్నపూర్ణేశ్వరి తత్వాన్ని భక్తులకు వివరించారు. సాయంత్రం మహిళలతో సామూహిక కుంకుమార్చన ఘనంగా జరిగింది.



నందికొట్కూరు: కాత్యాయని దేవిగా కన్యకాపరమేశ్వరి



మహానంది: కాత్యాయనిగా..



చౌడేశ్వరీదేవి ఆలయంలో.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఆత్మకూరు రూరల్ సీఐ

పాములపాడు: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాల తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ప్రజలకు అవగాహన కల్పించాని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని వివరించారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



పరిసరాలు శుభ్రం చేస్తున్న అధికారులు,



ప్రధాన రహదారిలో శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు

వెలుగోడు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ, తహసీల్దార్ శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీ, మేజర్ పంచాయతీ సర్పంచ్ వేల్పుల జయపాల్, ఇతర అధికారులు, నాయకులు పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే రేగడగూడూరు గ్రామంలో సర్పంచ్, గ్రామ పెద్దలు వి.కష్టారెడ్డి, రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ ప్రదేశాలు, జిల్లా పరిషత్ కార్యాలయం, ఓవర్ హెడ్ ట్యాంక్, వెటర్నరీ ఆస్పత్రి ప్రాంతాల్లో శ్రమదానం చేశారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

పాములపాడు: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి రాజు అన్నారు. గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని తుమ్మలూరు పంచాయతీలో ఏక్ దిన్- ఏక్ గంటా- ఏక్ సాత్ శ్రమదానం నిర్వహించారు. గ్రామంలోని వీధులు, కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రజలు ప్రతి రోజు పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక సమయం కేటాయించుకోవాలని సూచించారు. అపరిశుభ్రత వల్లే రోగాలు ప్రబలుతాయని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

బండి ఆత్మకూరు: మండలలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పార్నపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ గాయత్రి పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర జీవితం సాధ్యమవుతుందని తెలిపారు. స్వచ్ఛ గ్రామాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సర్పంచ్ షబ్బీర్ అహమ్మద్, వీఆర్ఓ కలాం, పంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం

ఆత్మకూరు: పరిసరాల పరిశుభ్రతే మనందరి ధ్యేయమని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు రషీద్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే మున్సిపల్ అధికారులకు తెలియపరిస్తే, పారిశుద్ధ్య పనులు చేపడతారన్నారు. అలాగే ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం

వెలుగోడు: పట్టణంలో శివరామ ధ్వజ ప్రతిష్ట, లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు పురోహితులు నారాయణ శర్మ, రవి కుమార్ శర్మ, చెన్నకేశవ శర్మల ఆధ్వర్యంలో గోపూజ, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశనం, రక్షాబంధనం, దీక్షాదారణం, రుత్విక్ వరణం, ప్రధాన కలశారాధనలు, వాస్తు, నవగ్రహారాధన, భద్రమండల పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోష పూజలు, మత్యంగ్రహణం, జలాధివాసం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం, దీక్షా హోమాలు, వేదస్వస్తి కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం, శనివారాలు విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, మహా పూర్ణాహుతి వంటి విశేష కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు సంజీవ రాయప్రసాద్, వాసవీ సత్రం అధ్యక్షుడు లాలం సుధాకర్, వెంకట సత్యనారాయణ, లాలం నాగార్జున పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏసురత్నం, మండల కార్యదర్శి స్వాములు, నాయకులు సంజీవరాయుడు డిమాండ్ చేశారు. గురువారం కొత్తపల్లిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విద్య, వైద్యం ప్రభుత్వ పరిధిలోనే ఉండాలని తెలిపారు. ఇప్పటికే సాధారణ విద్యలో 50 శాతం పైగా ప్రైవేటీకరణ జరిగిందని, అదే పరిస్థితి వైద్య విద్యలోనూ కొనసాగితే పేద, మధ్యతరగతి విద్యార్థులకు చదువు అందనంత దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పది వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించాలని మంత్రి వర్గం తీర్మానించడం పేదల విద్యను మరింత దూరం చేస్తుందని విమర్శించారు. నిర్మాణ ఖర్చు 60 శాతం కేంద్రం భరిస్తుండగా, రాష్ట్రం కేవలం 40 శాతం మాత్రమే భరించాల్సి ఉందని, ఈ భారం కూడా మోయలేకపోతున్నారా అని ప్రశ్నించారు. ప్రజల కోసం ప్రభుత్వమే కళాశాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు



పోలీస్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాలు, ఉత్సవాలు, పండుగల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట బందోబస్త్ నిర్వహించాలని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం శ్రీశైలం చేరుకున్న ఎస్పీ ముందుగా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం శ్రీశైలం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీశైలానికి వచ్చే వీవీపీ, వీవీఐపీల భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రీశైలం ఆలయ పరిసరాలు నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా, ఆలయ పరిసరాల్లో పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయులు ఉన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి



మహ్మద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆత్మకూరు: సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.దినేష్‌కుమార్, ఆత్మకూరు మండలాధ్యక్ష, కార్యదర్శులు సాయి ప్రశాంత్ డిమాండ్ చేశారు. గురువారం ఎంఈఓ-2 మహమ్మద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దసరా సెలవు దినాల్లో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయని తెలిపారు. వెంటనే ప్రైవేట్ పాఠశాలలపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు లక్ష్మణ్, నరసింహా, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మరిదిపై గొడ్డలితో దాడి

డోన్: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో అన్నదమ్ముల మధ్య నెలకొన్న భూవివాదం చివరకు గొడ్డలితో దాడి చేసేంత వరకు వెళ్లింది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల చంద్రుడు, రాంభూపాల్ అన్నదమ్ములు. కొంత కాలంగా పొలం విషయంలో వివాదం నడుస్తోంది. గురువారం తమ్ముడు రాంభూపాల్ బైక్‌పై వెళుతుండగా అన్న భార్య, కుమారుడు గొడ్డలితో దాడికి దిగారు. ఈ దాడిలో తల, వీపు భాగాన తీవ్ర గాయాలయ్యాయి. వారికి చిక్కకుండా ఇంటికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు

అవుకు(కొలిమిగుండ్ల): చెర్లోపల్లె-అవుకు రిజర్వాయర్ మార్గంలోని మలుపు వద్ద గురువారం ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. బనగానపల్లె మండలం ఇల్లూరి కొత్తపేటకు చెందిన ఫరూక్ తన కుమార్తెను తాడిపత్రిలో వదిలిపెట్టి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. చెర్లోపల్లె దాటాక మలు పు వద్ద బనగానపల్లె నుంచి తాడిపత్రి వెళుతున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో ఫరూక్ గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానికులు అతన్ని అవుకు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు నంద్యాలకు తరలించారు.

డిజిటల్ లావాదేవీలపై ప్రత్యేక దృష్టి

- డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

కోవెలకుంట్ల: పొదుపు మహిళలు డిజిటల్ లావాదేవీలపై దృష్టి సారించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో కోవెలకుంట్ల బ్లాక్ పరిధిలోని ఏడు మండలాల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీడీ మాట్లాడుతూ.. పొదుపు మహిళలు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, తదితర డిజిటల్ పద్ధతుల్లో లావాదేవీలు నిర్వహించుకోవచ్చన్నారు. పొదుపు మహిళలకు పొదుపు, డిపాజిట్లు వంటి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ పుస్తక నిర్వహణ, అప్పుల వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రతి సభ్యురాలికి 20 అంకెల నంబర్ ఉంటుందన్నారు. ఈ నంబర్ ద్వారా మొబైల్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ పొదుపుకు సంబంధించిన లావాదేవీలను సరి చూసుకోవచ్చన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్, ఇతర రుణాలను తీసుకున్న మహిళలు వందశాతం చెల్లించేలా వెలుగు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆయా మండలాల ఏపీఎంలు చంద్రశేఖర్, బాబు, సీసీలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత అధికారం పంచాయతీకే



ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

పాములపాడు: గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ కట్టడాల కూల్చివేత అధికారం పంచాయతీ వారికి ఉందని డీఎల్‌పీఓ లలితాబాయ్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. మండలంలోని వేంపెంట గ్రామంలో అంతర్గత రోడ్ల సమస్యపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సర్పంచ్ మాణిక్యమ్మ అర్జీ ఇచ్చారని తెలిపారు. అందుకే మండలానికి వచ్చినట్లు చెప్పారు. గ్రామంలో అక్రమ కట్టడాలను కూల్చివేసి గ్రామీణ రహదారుల నిర్మాణం చేపట్టాలని సర్పంచ్ మాణిక్యమ్మకు సూచించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ సులోచన ఉన్నారు.